సొదుం జయరాం కథలు

**20**

# వాడిన మల్లెలు

**మూ**ర్తి డ్రెస్ చేసుకునేముందు బయటికి చూడలేదు. తీరా డ్రెస్ చేసుకున్నాక కిటికీలోంచి బయటకు చూస్తే బయట సన్నగా తుంపర పడుతోంది. మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. కాసేపట్లో కుంభవృష్టి మొదలయ్యేట్టుంది. బయటకు వెళ్తే తడవటం ఖాయం. మూర్తి కుర్చీ కిటికీ దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు.

కిటికీ చువ్వలగుండా ఈదురుగాలి కొడుతోంది. ఇందాక పడుతున్న తుంపరపోయి పెద్ద పెద్ద చినుకులే పడుతున్నాయి. ఈపూట బయటికి వెళ్లి పని చూసుకోవడమంటూ కుదరదు. మూర్తి లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఉన్నట్టుండి అతని దృష్టి టేబుల్ మీదున్న మల్లెదండమీద పడింది. రెండు గంటల ముందు తను గదిలోకి రాగానే కసవు వూడ్పించాడు. దండ టేబుల్ మీద ఉండటం మూలాన కసవు వూచ్చేవాని దృష్టి నుంచి తప్పిపోయి ఉంటుంది.

మూర్తి టేబుల్ ముందు నిలబడి మల్లెదండని చేతికి తీసుకున్నాడు. దండ వాడిపోయి ఉంది, టేబుల్‌మీద రేకులు రాలాయి. అయినా ఇంకా పరిమళం పూర్తిగా చావలేదు.

అప్రయత్నంగా మూర్తి వూహలు మల్లెదండచుట్టూ ముసురుకున్నాయి. ఎవరో అమ్మాయి రాత్రి ఈ గదిలో గడిపింది. అమ్మాయి ఒక్కర్తే ఉండి ఉండదు. బహుశా ఆ అమ్మాయి భర్తకూడా ఉన్నాడేమో! ఇద్దరూ కొత్త దంపతులేమో! తను చూడని ఆ కొత్త దంపతులు తన మనో నేత్రంముందు స్పష్టంగా గోచరిస్తున్నారు. యేవో తియ్యటి అనుభూతులు గిలిగింతలు పెడుతున్నాయి.

మూర్తి పెదిమల మీద ఒక సన్నటి నవ్వు కదిలింది. తన వూహలు ఎప్పుడూ కొంచెం కాల్పనికంగా ఉంటవి. లేకపోతే తను ఇట్లా ఊహించడమేమిటి? మల్లెలు పెట్టుకున్నది అమ్మాయే ఎందుకు అయివుండాలి? వయసు మళ్ళిన స్త్రీ ఎందుక అయివుండకూడదు? అందునా జబ్బుమనిషి ఎందుకు కాకూడదు? ఏ వైద్యం కోసమో వచ్చి ఈ గదిలో ఉండటం కూడా సంభవమే!

గది తలుపు తెరుచుకున్నది. హోటలు బోయ్ కూజాతో నీళ్ల తెచ్చి పెడుతున్నాడు. చప్పున మూర్తికి ఒక ఆలోచన స్ఫురించింది. రాత్రి గదిలో ఎవరు గడిపారో హోటల్ బోయ్‌ని ప్రశ్నిస్తే తేలిపోతుంది. మూర్తికి మళ్ళీ నవ్వు వచ్చింది. ఈ చిన్న విషయానికి పనిగట్టుకొని వాణ్ణి ప్రశ్నించడమేమిటి? అయినా వాస్తవం కనుక్కోవాలన్న జిజ్ఞాస దేనికి తనకు? వాస్తవం కన్నా వూహలు మధురంగా ఉంటవి. వర్షం వెలిసేవరకు ఆ మల్లెదండ చుట్టూ తియ్యటి వూహాలోకం సృష్టించుకొని అందులో హాయిగా విహరించవచ్చు. వీలయితే ఆ మల్లెదండ ఆధారంగా ఒక చక్కటి కథ రాసి పడేసినా పడేయవచ్చు. కుక్కపిల్లమీదా, అగ్గిపుల్లమీదా, సబ్బుబిళ్లమీదా కూడా కథలు వచ్చాయి. మల్లెలు-వాడినవే కావచ్చు. కథావస్తువు కాకపోవడమేమిటి?

మూర్తి బోయ్‌ని కేకేసి కాఫీకి ఆర్డరిచ్చాడు. సిగరెట్టు ముట్టించి కళ్ళు మూసుకున్నాడు. వర్షం మూలాన బయట బస్సుల రొదలూ, కార్ల రొదలూ ఏమీ లేవు. చినుకుల చిటపటలు తప్ప అంతా ప్రశాంతంగా ఉంది. ఒక కప్పు కాఫీ చప్పరిస్తే మూడ్ రావడానికి ఎంతసేపో పట్టదు.

గది తలుపులు కిర్రుమని శబ్దంచేశాయి. మూర్తి విసుగ్గా కళ్లు తెరిచాడు. వాకిట్లో ఎవరో ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. పూర్తిగా తనకు అపరిచితుడు తను కథకుడు గనక ఎందరో అపరిచితులు తన పరిచయంకోసం వస్తుంటారు.

'రండి' అంటూ మూర్తి కుర్చీ చూపించాడు. కూర్చోడానికి సందేహిస్తున్నట్లుంది అతను. కాసేపు తటపటాయించి బెరుకు బెరుగ్గా కుర్చీలో కూర్చున్నాడు. తన్ను చూసి ఇంత విధేయత ప్రదర్శించిన వాళ్ళు తనకు ఎన్నడూ తగలలేదు.

'మీ పేరు?'

'నా పేరా సార్! రాంగోపాల్ సార్!' అన్నాడు వినయంగా. తర్వాత ఏం మాట్లాడాలో మూర్తికి తోచలేదు. సాధారణంగా అపరిచితుల్ని ఆహ్వానించడం తనవంతు. ఆ తర్వాత సంభాషణ వాళ్ళే మొదలెడుతారు. కాని రాంగోపాల్ ఆ కోవకు చెందినవాడులా కన్పించడం లేదు. బెదురుగొడ్డల్లే తనవైపు చూస్తున్నాడు. కుర్చీలో కుంచించుకుపోయి చాలా ఇబ్బందిగా కూర్చున్నాడు. ఆ మనిషితో ఏం మాట్లాడాలో మూర్తికి అంతుపట్టడం లేదు. ఏదోరకంగా సంభాషణ సాగదీయాలి.

'ఈ వూరేనా మీది?'

'అవును సార్! నేను సరళ తమ్ముణ్ణి సార్. ఆమె మిమ్మల్ని కలుసుకోమంటేనూ'.... నీళ్ళు నలుముతున్నాడు.

సరళ! ఎవరీ సరళ? తనకసలు ఆడవాళ్ళతో పరిచయాలే తక్కువ. తన పరిచయస్తుల పరిధిలో సరళ అన్న వ్యక్తి ఎవరూ లేరు. తనకు తెలియని వ్యక్తి తన్ను కలుసుకోమని తమ్ముణ్ణి పంపింది! అంతా ఏదో అయోమయంగా ఉంది. మూర్తి ఆశ్చర్యంగా రాంగోపాల్‌వైపు చూచాడు.

రాంగోపాల్ జేబులోనుంచి ఏదో కాగితం తీసి 'అప్లికేషన్ రాసి తీసుకొచ్చాను సార్. మా అక్క రాత్రి మీతో మాట్లాడానంది'.... తను రాత్రి ట్రెయిన్‌లో ఉన్నాడు. తనతో ఎవరూ మాట్లాడలేదు. ఏదో పొరపాటు జరిగింది. తన్నుఎవరో అనుకొని ఏదో మాట్లాడుతున్నాడు.

'నా పేరు మూర్తి. మీరు ఏదో పొరపడ్డట్టున్నారు.'

రాంగోపాల్ ముఖం వివర్ణమైంది. ఠపీమని కుర్చీలోంచి లేచాడు. బలవంతంమీద చిరునవ్వును పెదిమిల మీదికి తెచ్చుకొని 'క్షమించండి పొరపాటైంది' అంటూ చర చర బయటికి నడిచాడు.

మూర్తికి ఎక్కడలేని జుగుప్సా కలిగింది. అనవసరంగా తన మూడ్ పాడుచేశాడు. మూర్తి మళ్లీ సిగరెట్టు ముట్టించాడు. బోయ్ కాఫీ పట్టుకొచ్చాడు. కొంచెం కాఫీ చప్పరించగానే మొదట్లో ఏదో ఆలోచన తళుక్కుమంది. వెళ్తున్న బోయ్‌ని పిలిచాడు.

'రాత్రి ఎవరున్నారు ఈ గదిలో?'

తను ఎందుకు వాకబు చేస్తున్నాడో బాయ్‌కి అర్థం కాలేదు. ఆశ్చర్యంగా తనవైపు చూచాడు.

'మీకన్నా ముందుగా ఈ గదిలో 'డైరెక్టర్ ఉన్నాడు సార్' అన్నాడు.

'సినిమా డైరెక్టరా?'

బోయ్ లేదన్నట్లు తలతిప్పి 'కాదుసార్ ఏదో ఆఫీసు డైరెక్టరు. ఆఫీసు పేరు... ఉండండి చెబుతాను.' అని జ్ఞాపకం చేసుకోవడానికి తల గోక్కుంటున్నాడు.

రాష్ట్రంలో సవాలక్ష శాఖలున్నవి. అర్థగణాంకశాఖ, జనాభా సేకరణ శాఖ, పశుజనాభివృద్ధి శాఖ, స్త్రీ సంక్షేమశాఖ, శిశుసంక్షేమశాఖ, వన్యమృగ సంక్షేమశాఖ ఇంకా నానా శాఖలున్నవి. ఏ శాఖకో ఒక శాఖకు డైరెక్టర్ అయివుంటాడు. తనకు కావలసిన విషయం అదికాదు.

'రాత్రి ఒక్కడే ఉన్నాడా ఆయన ఈ గదిలో?'

'ఇక్కడ దిగడమేమో ఒక్కడే దిగాడు సార్. రాత్రి ఎవరో ఒకామెవచ్చి మళ్ళీ తెల్లారగట్లకే వెళ్ళిందిసార్' అంటూ బోయ్ పళ్ళు ఇకిలించాడు.

తనవూహ కరెక్టే. సందేహం లేదు. ఆవిడ సరళ! మూర్తి టేబుల్‌వైపు చూచాడు. తన కథావస్తువు నాడిన మల్లెదండ ఇంకా అట్లాడే ఉన్నది. మూర్తి బరువుగా నిట్టూర్చి మరో సిగరెట్టు వెలిగించాడు. సిగరెట్టు పొగల మధ్య కాసేపు పరిచయమున్న రాంగోపాల్ బొత్తిగా పరిచయంలేని సరళ, డైరెక్టరు అంతా క్షణంలో రూపుదిద్దుకున్నారు. కాగితాలుతీసి చకచకా కథ రాయడానికి ప్రారంభించాడు.

- (1968, సంవేదన)